392) గుండక్రియ

ప॥ ఇదివో నాసంపదా ఆస్తియు బాస్తి నీవు ఇతరంబులు నాకు బనిలేదు।
పదిలంబుగ నాబ్రతుకెల్లా నీవే పాలించగదే నారాయణా॥

చ॥ ఉపమల నే నార్జించిన ఉన్నతదనంబు నీవు।
తపము సేయగా గలిగెడుతత్ఫలంబు నీవు।
జపములవలన గలిగెడునాతేజఃప్రభావమును నీవు।

***



***

కపురుల దానధర్మపరోపకారంబుల బొందెడుమేలు నీవు॥

చ॥ పరము నాకు నీవు పరాత్పరమును నీవు।
గరిమల నిలలోపలియనంతభోగంబులు నీవు।
గరుడోరగాసురసిద్ధసాధ్యగంధర్వపదములు నీవు।
సురమునిపూజావేదపాఠసుకృతంబులు నీవు॥

చ॥ నాలుగాశ్రమంబులు నానావిద్యలు నీవు।
తాలిమి నాపంచవింశతితత్వంబులు నీవు।
ఈలీల శ్రీవేంకటేశ్వరా యిన్నియు నీవు నా కని యెరిగితి।
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు॥